క్లుప్తంగా

లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటే వారితోటలో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపుర సుందరి ఆలయంలో శ్రీ విజయగణపతి చవితి వార్షికోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మద్దాల సాయిబాబా, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో గరిక పూజ, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. మద్దాల ఫణేంద్ర, మద్దాల దేవిక ఆధ్వర్యంలో పులిహోర కుంభం సమర్పించారు. భక్తులు, దాతల సహకారంతో చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు కొమ్ము శ్రీనివాస్ తెలిపారు. కాశీబొట్ల మణికంఠ శర్మ లక్ష్మీ గణపతి హోమం జరిపించారు.

వీరవాసరం ఎస్సైగా కృష్ణాజి



బాధ్యతలు స్వీకరించిన వీరవాసరం ఎస్సై కృష్ణాజి

వీరవాసరం: వీరవాసరం ఎస్సైగా ఎస్ వీవీఎస్ కృష్ణాజి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని చెప్పారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని తెలిపారు. కృష్ణాజి భీమవరం వన్ టౌన్‌లో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై వీరవాసరం వచ్చారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు ఏలూరు సర్ సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 14, 15 తేదీల్లో నిర్వహించారని కోచ్ ధనాని సూర్యప్రకాష్ తెలిపారు. ఈ పోటీల్లో 14 సంవత్సరాల లోపు బాలబాలికల విభాగంలో కరాటే పోటీల్లో 17 మంది విద్యార్థులు పోటీ పడగా 17 స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. వీరిలో 13 మంది ప్రథమ, ద్వితీయ స్థానంలో 11 మంది, తృతీయ స్థానంలో 6గురు విద్యార్థులు గెలుపొందారన్నారు. అలాగే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఎస్.రూబీ నమ్రత, ఎస్.జ్యోస్లీ బ్లాక్ బెల్ట్ సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్స్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్.అప్పలస్వామి ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు హీరో సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కొట్లాట కేసు నమోదు

పాలకోడేరు: శృంగవృక్షం పెదపేటలో పాత గొడవల నేపథ్యంలో జరిగిన కొట్లాటపై ఇరు వర్గాలకు చెందిన 11 మందిపై ఆదివారం కేసులు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎస్.హరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సాక నరేంద్ర బాబుపై దాడికి పాల్పడిన వర్ధనపు నాగేశ్వరరావుతో పాటు మరో ఆరుగురిపైనా, ఇదే గొడవలో వర్ధనపు వెంకటరత్నంపై దాడి చేసిన కంచే నరేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పాలకోడేరు: పోక్సో కేసులో సాక్షిగా ఉన్న బాలిక కనిపించకపోవడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై ఎస్.హరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం పెనుమంట్ర మండలానికి చెందిన సదరు బాలిక భీమవరం జడ్జిమెంట్‌కు వచ్చిన కేసు నిమిత్తం కోర్టుకు హాజరయ్యేందుకు పాలకోడేరు మండలంలో ఉన్న అన్నయ్య ఇంటి వద్ద రెండు నెలలుగా ఉంటుంది. ఈ క్రమంలో శనివారం అదృశ్యమవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొన్నాడ మృతి తీరని లోటు

నరసాపురం: సీపీఎం పట్టణ నేత పొన్నాడ రాము మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాల్ అన్నారు. పొన్నాడ రాము సంస్మరణ సభను ఆదివారం పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బాబాయ్‌గా సుపరిచితుడైన రాము చిన్ననాటి నుంచి సీపీఎం కోసం పేదల పక్షాన పని చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, కవురు పెద్దిరాజు, పొగాకు నారాయణరావు, పొగాకు పూర్ణ పాల్గొన్నారు.

వ్యాకుల మాత గ్రామోత్సవం

పెనుగొండ: వ్యాకుల మాత గ్రామోత్సవం పెనుగొండ చెరుకువాడలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం వ్యాకుల మాత జయంతి సందర్భంగా ఉదయం నుంచి చెరుకువాడ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

ఇంజనీర్లకు స్ఫూర్తి విశ్వేశ్వరయ్య



భీమవరం: ఇంజనీర్లను సత్కరిస్తున్న దృశ్యం



ఆకివీడు: సచివాలయ ఇంజనీర్లను సన్మానించిన దృశ్యం

ఉండి: భారత రత్న, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. ఉండి లయన్స్ క్లబ్ హాలులో ఆదివారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. క్లబ్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు ముదునూరి శివరామరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ దేశాభివద్ధికి ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. విశ్వేశ్వరయ్య చేసిన సేవలను గుర్తు చేశారు. విశ్రాంత రైల్వే ఇంజనీర్ రుద్రరాజు వెంకటరామరాజు, జలవనరుల శాఖ సహాయ ఇంజనీర్ సోమిశెట్టి జయ ప్రకాష్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రుద్రరాజు నరసరాజు, పాలతీర్థపు నరసింగరావు, భూపతిరాజు హరనాథ్‌రాజు, కాగిత మహంకాళి, బుద్ధరాజు సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

పాలకోడేరు: అద్వితీయమైన మేధస్సుతో ఎన్నో సివిల్ ఇంజినీరింగ్ కట్టడాలకు ప్రాణం పోసిన ఇంజినీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డే గా నిర్వహించుకుంటున్నామని శృంగవృక్షం జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు తోట కాశీ జగన్నాథం అన్నారు. ఆదివారం హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకోడేరు మండలం ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఇంజినీర్స్ డే సందర్భంగా నలుగురు ఇంజినీర్లను సన్మానించడం హర్షణీయమన్నారు. పాలకోడేరు ట్రాన్స్‌కో ఏఈ ఆర్‌వీ అప్పారావు, పంచాయతీరాజ్ ఏఈ వీఎస్ విజయకుమార్‌రాజు, హౌసింగ్ ఏఈ బీహెచ్‌బీ నరసింహరాజు, ఉండి హౌసింగ్ రిటైర్డు ఏఈ డి.రామకృష్ణంరాజు, రిటైర్డ్ ఏఈ సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలకోడేరు మండల లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సన్నిధి పాలేశ్వరరావు, వెంకటరత్నం చౌదరి, పురుషోత్తం, వెంకటరాజు, అత్యం వాసు, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి ఇంజనీర్లే పునాది

ఆకివీడు: అంతర్జాతీయ స్థాయిలో మన ఇంజనీర్ల నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం అగ్ర స్థానంలో ఉందని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు చెప్పారు. ఇంజనీర్స్ డే సందర్భంగా స్థానిక లయన్స్ కార్యాలయంలో పలువురు సచివాలయ ఇంజనీర్లు, ఏఈ, ఏడీఈలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతికి ఇంజనీర్లే పునాదులన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్వీ సూర్యనారాయణరాజు, దాట్ల రామరాజు, గొంట్లా కృష్ణ, సత్యనారాయణ, పల్లి అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు సత్కారం

భీమవరం: శ్రీవిజ్ఞానవేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం రైల్వే జంక్షన్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు ఇంజనీర్లను సత్కరించారు. రైల్వే డివిజనల్ ఇంజనీర్ అందే శంకర్ రామాంజనేయులు, రైల్వే ఇంజనీర్లు వై రాంబాబు (ఐఒడబ్ల్యూ ఎస్ సీఎం), కే మనోహర్ (ఎస్ఎస్ఈ ఈసీజీ ఎలక్ట్రికల్), మోహన్ (ఎస్ఎస్ఈ ఒహెచ్), సయ్యపురాజు సూర్యనారాయణరాజు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నదులకు ఆనకట్టలు నిర్మించి దేశ ఆర్థిక పరిపుష్టికి, ప్రగతికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, యువ ఇంజనీర్ భట్టిప్రోలు మధుసూదన్‌రావు (నూజివీడు), హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఇంజనీర్స్‌డే, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భీమవరం సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బొండా వెంకటేశ్వరరావు మోక్షగుండం విశ్వేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి యువ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని అన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ కోచైర్మన్ కారుమూరి నరసింహమూర్తి (బాబు), బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పాలకోడేరు: ట్రాన్స్‌కో ఏఈ ఆర్‌వీ అప్పారావును సన్మానిస్తున్న దృశ్యం



ఉండి: కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్తి బ్రహ్మారెడ్డి



భీమవరం: విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అన్నదాతలను నిండా ముంచిన గోదావరి



అయిభీమవరం రోడ్డులో ముంపునీటిలో కుళ్లుతున్న వరి చేలు

ఆకివీడు: గోదావరి అన్నదాతను నిండా ముంచేసింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగింది. రెండు నెలల వ్యవధిలో వరి రైతులను రెండు సార్లు ముంచేసింది. గోదావరి ఉద్ధృతితోనే పశ్చిమ డెల్టా ప్రాంతంలో వరి 70 శాతానికి పైగా ధ్వంసమైంది. పీకల్లోతు నీటిలో వరి చేలు మునిగిపోయి రెండు, మూడు వారాలు ఉండటంతో వరి పూర్తిగా కుళ్లిపోయింది. కొన్నిచోట్ల వరి అక్కడక్కడా కన్పిస్తున్నా ఫలితం లేకుండా పోయిందని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఈ క్రాఫ్ నమోదు అయినప్పటికీ పంటల బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో బీమా వస్తుందో, రాదో అన్న సందిగ్ధంలో రైతులున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతు భరోసా సహాయం అందలేదు. నారుమడులను, నాట్లను రైతులు రెండు సార్లు వేసినప్పటికీ ఖరీఫ్ పంట దక్కకుండా పోయింది. నష్ట పరిహారం, బీమా సౌకర్యం కల్పించాలని, రబీ సాగుకు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 9 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, వేల్పూరు, ఇల్లిందలపర్రు, కె.సావరం పరిసర గ్రామాల్లో ని మంచం నుంచి లేవలేని వృద్ధులకు వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు.

అట్టహాసంగా వినాయక నిమజ్జనాలు

కాళ్ల: గణపతి నవరాత్రుల కార్యక్రమాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. కాళ్ల మండలం కలవపూడిలో వేంచేసియున్న వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్లలో పాండురంగ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సంపత్ వినాయకుడి నిమజ్జనం సందర్భంగా మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదాలను వేలం నిర్వహించారు. వేలంలో శ్రీనివాస్ 25 కేజీల లడ్డు ప్రసాదాన్ని రూ.25,000, లక్ష్మీనారాయణ 5 కేజీల లడ్డును రూ.10,000 లకు దక్కించుకున్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనం

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పలు చోట్ల మండపాల్లో గణేష్ విగ్రహాలను ఆదివారం ఊరేగింపుగా తరలించారు. పురవీధుల్లో వివిధ శక్తి వేషాలతో, డప్పు, గరగ నృత్యాలతో ప్రదర్శనలు నిర్వహించారు. తీన్‌మార్‌తో యువకులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. పలు చోట్ల మహిళలు స్వామివారికి బిందెలతో నీళ్లు పోసి, బియ్యం, బెల్లం, కొబ్బరికాయలను సమర్పించారు.

అన్నసమారాధన

వీరవాసరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో స్వామివార్ల విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య గణనాథుని విగ్రహాలకు ఊరేగింపు ఘనంగా నిర్వహించి నిమజ్జనం చేశారు. కొన్ని గ్రామాల్లో అన్న సమారాధన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు.



కాళ్ల: గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం



వీరవాసరం: అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఘనంగా గణపతి నిమజ్జనాలు

కాళ్ల: గణపతి నవరాత్రి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఘననాథుడి విగ్రహాలు భారీ ఊరేగింపుల నడుమ, బాణ సంచా కాల్పులతో, తీన్మార్ వాయిద్యాలతో యువకులు ఉత్సాహంగా నిమజ్జనాల కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా పలు గ్రామాల్లో నవ రాత్రులను పురస్కరించుకొని భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉండి: వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో రోజైన ఆదివారం ఉదయం నుంచి మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనానికి భారీ ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాళ్ల: వేలంలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తులు



ఆకివీడు: నిమజ్జనానికి ఊరేగింపుగా తరలిస్తున్న గణేష్ విగ్రహం



ఉండి: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గంగాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పచ్చని పంట పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఎల్బీచర్ల గంగాలమ్మ ఆలయానికి మొక్కుబడులు, నైవేద్యాలను సమర్పించుకునేందుకు పెద్దఎత్తున ప్రజలు రావడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల విరాళాలు



విరాళం అందజేస్తున్న భీమవరం బులియన్ మర్చంట్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ల సభ్యులు



ఎమ్మెల్యేకు విరాళం అందజేస్తున్న డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, వెంకట పద్మ

భీమవరం: వరద బాధితులకు భీమవరం బులియన్ మర్చంట్ అసోసియేషన్, భీమవరం పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ 3.50 లక్షల విరాళం అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు దాతలు అందజేశారు. కార్యక్రమంలో కోట్ల నాని, కారుమూరి సత్యనారయణ మూర్తి, బొండాడ నాగభూషణం, వబిలిశెట్టి రామకృష్ణ, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, బొండా రామకృష్ణ, వబిలిశెట్టి పార్థసారథి, బొండా రాంబాబు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

రూ.లక్షా 50 వేల విరాళం

భీమవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం డాక్టర్ నాగిడి హరిశ్చంద్రప్రసాద్, నాగిడి వెంకట పద్మ రూ.లక్షా 50 వేలు విరాళాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు అందించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



తోకతిప్పలో సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పోరాటాల ముద్దుబిడ్డ సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలుగు వారు కావడం మనందరం గర్వించదగ్గ విషయమని ఆ పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తోకతిప్ప గ్రామంలో ఆదివారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడలో జన్మించిన ఏచూరి ఎవరికైనా సమస్య వస్తే ఆ సమస్య పరిష్కరించే వరకు పోరాటం సాగించేవారని అన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టులకు, దేశ ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల శాఖా కార్యదర్శి బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని నాగేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్షయ పాత్ర ఆహారం పంపిణీ

పెనుగొండ: వడలిలో అక్షయ పాత్ర సభ్యులు పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఆదివారం ఇలపర్రు మాజీ సర్పంచ్ కేతా సత్తిబాబు ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను అక్షయ పాత్ర సభ్యులు సేకరించి వడలిలో పేదలకు పంపిణీ చేశారు. సమాచారం అందించి సహకరించిన కేతా సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, కట్టా రామకృష్ణ, తొంటా దుర్గారావులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం సిద్ధాంతం చింతలపాలెం, వడలిలో ఆహారం పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో విందు భోజనంలా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పిల్లి దుర్గారావు, కవురు సత్తిబాబు, బొక్కా సత్యనారాయణ, కవురు మురళి, కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ నాయకులు

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పోడూరు మండలం వేడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మణిపాల్, విజయవాడ ఆసుపత్రి నుంచి పలువురు వైద్య నిపుణులు పాల్గొని సుమారు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. గుండె, ఎముకలు, చర్మ వ్యాధులు, జనరల్ మెడిసిన్, దంత వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. యూకేసీ గవర్నర్ పెనుమాక రామమోహన్, అధ్యక్షుడు జక్కంపూడి మాధవ్, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పద్మారావు, ఇనుకొండ రంగారావు, దుప్పనపూడి దొరబాబు, యర్రంశెట్టి నరసింహారావు, చెల్లబోయిన శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.